# సుగుణ

'ఉద్యోగం ఉద్యోగం అని కలవరించి పోయారు. తీరా అది కాస్తా వచ్చేప్పటికి చప్పబడి పోయారేంటి....'

'లేని దానికోసం తాపత్రయ పడటం సహజం. అయితే కష్ట పడి ప్రయత్నం చేసి సాధించటంతో వుండే ఆనందం దయాధర్మ భిక్షంగా రావటంలో వుండదు....'

'మీరనుకున్నంత తేలికగా మాత్రం యీ ఉద్యోగం రాలేదు...'

'ఈ ఉద్యోగం కోసం నా పరువు ప్రతిష్ఠలు యెంతవరకు ఖర్చయినాయో అని నా ఆవేదన...'

'మీరంటున్న దేమిటో నాకర్థం కావటంలేదు. నేను చెయ్యరాని పనేమి చెయ్యలేదు. భార్యగా నా బాధ్యత సక్రమంగా నెరవేర్చుకున్నాను. మీకు ఉద్యోగం యిప్పించాను. మీకోసం నేను

ఉద్యోగం చెయ్యటం మానుకుంటున్నాను... అదే నేను చేసిన తప్పవుతే మీరు నన్ను క్షమిస్తారనుకుంటాను....'

'....సుగుణా! నా మతి పోతోంది. నువ్వేం చేశావో చెప్పు ....' 'నేను యేం చేశానని మీరనుకుంటున్నారో అది ముందర నాకు చెప్పండి....'

'నేను నిన్ను గురించి యేమనుకున్నా ఫరవాలేదు. కాని లోకం నిన్ను గురించి యింకో విధంగా అనుకోవటం నేను భరించ లేను...'

'నా మీద మీకున్న అభిమానానికి చాలా చాలా కృతజ్ఞతలు...'

'సుగుణా నువ్వు నన్ను అపార్థం చేసుకోవద్దు. నీ మీద నాకు పూర్తి విశ్వాసం వుంది....'

'నా మీద మీకు అంత విశ్వాసం ఉండబట్టే, నేను యింత ధైర్యంగా చెయ్యగలిగాను....'

"నా విశ్వాసం ఆసరా చేసుకుని నువ్వు చెయ్యకూడని పని చేస్తావని నేను అనుకోవటం లేదు...."

'మీ కా విశ్వాసం పోయిననాడు నే నేంచేసినా, మీకు అది చెయ్యకూడని పనిగానే కనిపిస్తుంది..."

'నువ్వేం చేశావో చెప్పమని అడగటానికి ధైర్యం చాలక పోయినా నువ్వు చెబుతావనే విశ్వాసం మాత్రం నాకు గట్టిగా వుంది....'

మీకు తెలుసుకోవాలనే పట్టుదలవున్నప్పుడు చెప్పక పోవాలనే దురుద్దేశం మాత్రం నాలో లేదు....'

నువ్వు చెప్పక పోయినంత మాత్రాన నీ మీద నా కున్న విశ్వాసం సడలుతుందని నువ్వనుకుంటావని నేను ఊహించటం లేదు...'

'మీకు నా మీద విశ్వాసం యెంత గాఢంగా వుందో తెలుసు కోవటానికి నా సహనాన్ని మీరు పరీక్ష చేస్తున్నారనుకుంటాను'.

'నేను యెంతో ఆదుర్దాగా వేస్తున్న ప్రశ్నలకు యింత తాపీగా సమాధానాలు యిస్తూ ముందర నా సహనాన్ని నువ్వు పరీక్ష చేస్తున్నావు....'

'మీ సహనమే నాకు రక్ష. మీ విశ్వాసమే నాకు అండ ....' ఈ రెండూ ఆసరా చూసుకుని సూటిగా గదిలోకి వెళ్ళి పోయాను. ఆయన వంటరిగా సోఫాలో కూర్చుని వున్నాడు. నేనూ వెళ్ళి ఆయన ప్రక్కగా కూర్చున్నాను. ఆయన కళ్ళల్లో కళ్ళుపెట్టి చూశాను. ఆయన విలవిలలాడి పోయాడు. నన్ను దగ్గరకు తీసు కుందామనే ఆవేశంతో కొంచెం ముందుకు వొరిగాడు— ముందర నేను వచ్చిన పని పూర్తి కావాలి. తర్వాత మీరు కోరిన పని పూర్తి అవుతుంది అన్నాను....'

'ఆ తర్వాత...'

'అదిగో మళ్ళీ మీ సహనం అంతరిస్తోంది...'

"నా సహనం అంతరించటంలేదు. తెలుసుకోవాలనే కుతూ హలం ముందుకు వస్తోంది అంతే..." తాపీగా అన్నాడు మోహన్.

'నా మీద ఆయనకు పూర్తి విశ్వాసం కలిగింది. నేను కలి గించాను నా మాటల్లో ఆయనకు యేదో ఆకర్షణ కనిపించింది. అదే ఆయన బలహీనత...'

'విశ్వాసం వుండటం బలహీనతే అంటావా...'

"ఆయనకు నా మీద ఆ క్షణాన కలిగిన విశ్వాసం బలహీనతే అంటాను...." ఆమె సూటిగా అతని కళ్ళలోకిచూసింది

చప్పున మీకు ఉద్యోగానికి ఆర్డరు కాగితం యిచ్చేశాడు. నేను ఒక తీర్చలేని వాగ్దానాన్ని చేసివచ్చాను. అది ఆయన నమ్మాడు. అంతే....'

'నమ్మినవాన్ని మోసం చెయ్యటం మహాదారుణం నువ్వు చేసిన వాగ్దానం నెరవేర్చటం నీ విద్యుక్త ధర్మం నువ్వెళ్ళు....'

'మతుండి మాట్లాడుతున్నారా....'

'నాక్కాదు వుండాల్సిందిమతి. నీకు. నీ కుండాలి ఆ మతి ఆ వాగ్దానం చేసినప్పుడు ...ఆ తీర్చలేని వాగ్దానం చేసినప్పుడు .... ఒకర్ని మోసంచేసి మనం లాభం పొందటం మహాదారుణం. నేను యిలాంటి దాన్ని సహించలేను....'

'ఉద్యోగం ఉద్యోగం అని పగలూ రాత్రిళ్ళు కలవరించి పోయారే. తీరా చేతి కొచ్చిన తర్వాత జారవిడుస్తారా....'

'చాలామంది ఉద్యోగం కేవలంజీవితంగడవటానికే చేస్తారు. మనకు అలాంటి అవసరం ప్రస్తుతం కనిపించటం లేదు. అయినా నేను ఒక ఉద్యోగం చెయ్యాలనే పట్టుదలపట్టింది కేవలం నావ్యక్తిత్వాన్ని పెంచుకోవడానికి, లోకం దృష్టిలో నేనుకూడా సమర్థున్ని అనిపించుకోవటానికి. నాకు ఆత్మవిశ్వాసం లేని పనియేదీ చెయ్యను. చెయ్యలేను కూడా....'

'మీరు చాలా పొరపాటు పడుతున్నారు .... ఈ ఉద్యోగం మీ కెలా వచ్చిందో యెవ్వరికి తెలీదు .... ఆయనా నోరు మెదప

లేడు, ఉద్యోగం యివ్వటం ఆయన వంతుగాని తీసెయ్యడం ఆయన తరంకాదు...."

'అందుకని....' చప్పున అనేశాడు ఏటూతోచక.

'ఎందుకు అంత యిదయిపోతున్నారు. మీకు అవమానం కలిగించే పని యెన్నడూ చెయ్యనని చెప్పాగా. తర్వాత యేం జరిగిందో చెపుతా పట్టండి.... ఆయన దగ్గర ఆర్డరు కాగితం తీసుకు వచ్చానేగాని నా మనస్సు మనస్సులో లేదు. కొయ్యబారి పోయాను. నేను చేసిన పని సరిఅయినది కాదని నా అంతరాత్మ నాకు చెపుతోంది. మర్నాడు వస్తానన్న టైముకు సూటిగా ఆయ నింటికి వెళ్ళాను. ఆయన గదిలో ఒంటరిగా సోఫాలో కూర్చు న్నాడు. నేనూ వెళ్ళి అయన ప్రక్కనే కూర్చున్నాను...."

'ఊఁ....' మొహాన కారుతున్న చెమటలు తుడుచుకుంటూ తెరిచిన నోరు మూయకుండా సుగుణ మొహంలోకి శూన్యంగా చూస్తున్నాడు.

'.... నేను తీర్చలేని వాగ్దానాన్ని ముందు వెనకలు ఆలో చించకుండా చేశాను క్షమించండి. ఈ ఆర్డరు కాగితం మీరే వుంచు కోండి. మా వారికి ఉద్యోగం అక్కర్లేదు — అని గబ గబ అనేసి చివాలున లేచాను....చప్పున నా చెయ్యి పట్టుకున్నాడు....'

ఆమె కుదుఃఖం ఆగలేదు.

'రాస్కెల్ త....ర్వా....త....'

'అమ్మాయి కూర్చో అన్నాడు.... నువ్వు తొందరపడి యిక్క డికి వచ్చావు. ఎవరో ఏదో చెపితే నమ్మి యిట్లా రాకూడదు. మోహన్ రిటెన్ టెస్ట్ బాగా రాశాడు. ఇంటర్వ్యూలో కూడా ఫస్టే

వచ్చాడు. అతనికి ఉద్యోగం ఇవ్వటానికి బోర్డు నిర్ణయించింది. అయితే నీ మూలాన నీ భర్తకు ఉద్యోగం వచ్చిందని నువ్వనుకుంటే నాకేమి అభ్యంతరం లేదు. నా బలహీనత వలన ఆ ఉద్యోగం వస్తుందనే నీ నమ్మకాన్ని తోసిపుచ్చటం నాకిష్టం లేక ఆట్లా చేశాను. అంతే....' అన్నాడు.

ఆ సమయంలో నా మనసు ఎట్లా వుందో యిప్పుడు చెప్పటం నా తరంకాదు .... ఇహ ఈ ఉద్యోగాన్ని గురించి అపోహలన్నీ తొలగిపోయినట్టేగా .... ఆయాసపడుతూ అన్నది.

'ఇది కూడా నిజంగా, నన్ను నమ్మ మంటావా .... ప్రాధేయంగా అడిగాడు.

"మీ విశ్వాసమే నాకు పెద్దరక్ష....' అంతకంటె ప్రాధేయంగా అన్నది సుగుణ